ప్రజాశక్తి

గురువారం 10 అక్టోబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఎట్టకేలకు మోక్షం...



- సముద్రంలో ఏళ్లకిందట మునిగిన ట్రాలర్లు, బోట్ల తొలగింపు
- విశాఖ పోర్టు అథారిటీ ఆధ్వర్యాన శరవేగంగా పనులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

సముద్రంలో మునకకు గురైన బోట్లు, ట్రాలర్లకు మోక్షం లభించింది. ఏళ్లతరబడి సంప్రదాయ మత్స్యకారుల ప్రధానమైన డిమాండ్ అయిన నీటమునిగిన బోట్లను బయటకు తీయాలంటూ వైజాగ్ పోర్టు అధికారులకు విశాఖ మత్స్యకార సంక్షేమ సంఘాలు, మత్స్యకారుల వినతులపై పోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ బోట్లు, ట్రాలర్లు ఇలాగే నీటిలో ఉండిపోతే పెరుగుతున్న బోట్లను తీసుకు వచ్చేందుకు, తమ జీవనోపాధికి తీవ్ర విఘాతం కలుగుతుందని, బోట్ల కదలికలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ ఏళ్లుగా మత్స్యకారులు తీవ్ర స్థాయిలో ఆవేదన చెందడం తెలిసిందే. 1990వ దశకం అంతకు ముందునుంచీ ఫిషింగ్ హార్బర్ (చేపల రేవు)లో పదుల సంఖ్యలో మత్స్యకారుల బోట్లు, ట్రాలర్లను ఎట్టకేలకు వైజాగ్ పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) ఆధ్వర్యాన అధికారులు చొరవ చేసి వెలికి తీసే ప్రక్రియను ముమ్మరం చేశారు. ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారుల బోట్ల సంఖ్య ఈ కాలంలో వేలల్లో పెరిగిపోవడంతో బోట్లను నిలిపేందుకు జెట్టీల కొరత విపరీతంగా వెంటాడుతూ వస్తోంది. సముద్రంలో 5 మీటర్ల లోతు మేర ఈ బోట్లన్నీ ఏళ్లతరబడి ఉండిపోవడంతో బోట్లను సముద్రంలో నిల్చొబెట్టేందుకు వీల్లేకుండా పోవడంతో

మిగతా 2లో..

బోట్లను తీస్తున్న జెసిబిలు

మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యం : పోర్టు సెక్రటరీ టి వేణుగోపాల్

మత్స్యకారుల సంక్షేమంతో పాటు ఫిషింగ్ హార్బర్‌లో కార్యకలాపాలకు ఆటంకం లేకుండా, సురక్షిత చేపల వేటకు ఇబ్బందుల్లేకుండా సమర్ధవంతమైన రీతిలో పోర్టు సేవలు అందిస్తుందని, ఈ ఏడాది డిసెంబరులోగా ఈ పనులన్నీ పూర్తిచేస్తామని పోర్టు ట్రస్ట్ సెక్రటరీ టి.వేణుగోపాల్ బుధవారం వెల్లడించారు.

నీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- తాజా పర్చుతున్న ఓటర్ల జాబితా
- నాలుగు ప్రాజెక్టు కమిటీలు, 303 సాగునీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో 303 నీటి వినియోగదారుల సంఘాలకు ఓటర్ల జాబితా తయారుచేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం ఉంది. సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహణకు ప్రభుత్వం నిర్ణయించడంతో వనరుల వారీగా ఓటర్లను గుర్తిస్తున్నారు. ఈ సంఘాలకు త్వరలో జరిగే ఎన్నికలకు ఆయకట్టుదారులు ఓటర్లు కానున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో ఒక భారీ నీటిపారుదల ప్రాజెక్టు, మూడు మధ్య తరహా ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో రెండు లక్షలా 257 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ నీటిపారుదల జలాశయం తాండవకు ప్రాజెక్టు కమిటీతో పాటు మూడు డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు ఎన్నికలు జరగనున్నాయి. మధ్యతరహా ప్రాజెక్టులు రైవాడ, పెద్దేరు, కోణాంకు ఒక్కొక్క ప్రాజెక్టు కమిటీకి ఎన్నిక జరగనుంది. భారీ, మధ్యతరహా, చిన్న తరహా సాగునీటి వనరుల పరిధిలో మొత్తం 303 నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

తాండవ ప్రాజెక్టు

2015లో జరిగిన సాగునీటి సంఘ ఎన్నికల ఓటర్ల జాబితాలో స్వల్పమార్పులు చోటుచేసుకొనే అవకాశముంది. ఓటర్ల జాబితాను తాజా పర్చడం కోసం సాగునీటి వనరుల పరిధిలోని ఆయకట్టుదారుల వివరాలను విఆర్ఒల నుంచి సేకరిస్తున్నారు. సాగునీటి సంఘాల వారీగా జరగనున్న ఎన్నికలకు వాటి పరిధిలోని ఆయకట్టుదారులను

మిగతా 2లో..

పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకివ్వొద్దు

- 11న నిరసన
- సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌ను పిపిపి పద్ధతిలో ప్రయివేటుకు ఇచ్చే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని, పోర్టు నిధులతోనే అభివృద్ధి చేసి ఉద్యోగులు, కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 11వ తేదీన సాలిగ్రామంపురంలోని పోర్టు హాస్పిటల్ ఎదుట నిరసన చేపట్టనున్నట్లు సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తెలిపారు. జగదాంబ సమీపంలోని నండూరి ప్రసాదరావు భవనంలో బుధవారం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుబ్బారావు, వి.కృష్ణారావులతో కలిసి జగ్గునాయుడు మీడియాతో మాట్లాడారు. పోర్టు గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ 1984లో 150 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలందించిందన్నారు. ఇప్పుడు దానిని 300 పడకల మల్టీ డిసిప్లెనరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడాన్ని సిపిఎం స్వాగతిస్తుందన్నారు. అయితే పిపిపి పేరుతో ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదన్నారు. టెండర్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. 300పడకల ఆసుపత్రి నిర్మించి కేవలం 80 పడకలు మాత్రమే ఉద్యోగులకు కేటాయిస్తామని చెప్పడాన్ని ఆయన తీవ్ర వ్యతిరేకించారు. పోర్టు ఆఫీసర్స్, ఉద్యోగులు, కార్మికులు, మాజీ ఉద్యోగుల కుటుంబాలు సుమారు 40 వేల మంది ఈ హాస్పిటల్‌లోనే వైద్యం పొందుతున్న సంగతిని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, పోర్టు యాజమాన్యం మర్చిపోరాదన్నారు.

విశాఖపట్నం పోర్టు ప్రభుత్వరంగ సంస్థలో ఉంటూ మంచి లాభాలార్జించిందన్నారు. క్రమేణా బెర్తులు ప్రయివేటీకరించడం, స్టేడియం, భూములన్నీ ప్రయివేటువారికి దారాధత్తం చేయడానికి పూనుకుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.380 కోట్లు లాభాలతో నడిచిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.171 కోట్లు పన్నులు చెల్లించిందని గుర్తు చేశారు. కార్గోహాండ్లింగ్‌లో దేశంలో రికార్డులు సాధించిందని తెలిపారు. ఈ లాభాలకు కారణం ఉద్యోగులు, కార్మికులు అన్నారు. సంస్థ లాభాలకోసం పనిచేస్తున్న కార్మికుల ఆరోగ్యాలను కాపాడాల్సిన యాజమాన్యం ప్రయివేట్ లాభాలు కోసం చూడటం సరైనది కాదని, తక్షణమే విశాఖపోర్టు నిధులతో హాస్పిటల్ నిర్మాణం చేపట్టి ఉద్యోగులకు, కార్మికులకు, రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్యం

మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఎట్టకేలకు మోక్షం...

మత్స్యకారులంతా సంవత్సరాల తరబడి తీవ్ర కష్ట, నష్టాలను అనుభవిస్తూ వస్తున్నారు. హార్బర్ ఆధునీకరణలో భాగంగా వైజాగ్ పోర్టు అథారిటీ బోట్లను వెలికి తీసేందుకు ప్రక్రియను ప్రారంభించడం పట్ల మత్స్యకారులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైజాగ్ పోర్టు ట్రస్ట్ అథారిటీ (విపిఎ) సెక్రటరీ టి.వేణుగోపాల్ పర్యవేక్షణలో అధికారులు, సాంకేతిక సిబ్బంది ఈ పనిలో నిమగ్నమయ్యారు.

రూ.1.20కోట్లతో శిథిలాల తొలగింపు...

ఫిషింగ్ హార్బర్‌లో జెట్టీల వద్ద ఏళ్లతరబడి పదుల సంఖ్యలో బోట్లు 11, ట్రాలర్లు 6 ఇలా సుమారు 17 వరకూ మునిగిపోయి శిథిలావస్థకు చేరిపోయిన అంశంపై పోర్టు అధికారులు గతంలోనే సాంకేతిక నిపుణులతో అధ్యయనం చేయించారు. దీనికోసం ఫిషింగ్ హార్బర్ (వేవల రేవు) ఆధునీకరణ పనులకు కేటాయించే రూ.100కోట్లలో ఒక కోటీ 20లక్షల రూపాయలను పోర్టు యాజమాన్యం ఖర్చుచేసేందుకు సిద్ధమైంది. శిథిలాలు అనేకం జెట్టీల వద్ద ఉండిపోయాయి. ఇవి ఇలాగే ఉండిపోతే తమ బోట్లను తీసుకొచ్చి ఇక్కడ నిలపడం పెద్ద సమస్యగా మారిందని మత్స్యకార సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సుమారు 6 ఫిషింగ్ ట్రాలర్లు, 11 బోట్లు సముద్రం అడుగున మునిగిపోయి ఏళ్లతరబడి ఉన్నట్లు పోర్టు అధికారులు గుర్తించారు. అయితే సముద్రం అడుగునకు కొన్ని బోట్లు వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఇవి సముద్రం నీటి అడుగున మడ్డిలో కూరుకుపోయి నాచుపట్టి ఉండడం కనిపించింది. బుధవారం కొన్ని బోట్లు, ట్రాలర్ల శిథిలాలను బయటకు తీశారు. దీంతో ఈ శిథిలాల గుర్తింపు, వెలికితీత, అక్కడ నుంచి తొలగించేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోర్టు అధికారులు వినియోగిస్తున్నారు. ముఖ్యంగా శిథిలాలను ముక్కలుగా కత్తిరించేందుకు అండర్ వాటర్ కట్టర్లను వాడుతున్నారు. శిథిలాల్లో పేరుకుపోయిన మడ్డిని తీసేందుకు అధిక సామర్థ్యం కలిగిన జనరేటర్, కంప్రెసర్లను పోర్టు వినియోగిస్తుంది. నీటి అడుగున శిథిలాలను ఇలా తొలగించేందుకు నిపుణుల సేవలను పోర్టు వినియోగించడం కనిపిస్తోంది.

నీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

గుర్తించకల్గిన రెవెన్యూ యంత్రాంగానికి ఓటర్ల జాబితా తయారీ పని ప్రభుత్వం అప్పగించింది. ఎన్నికలు జరగాల్సిన పాత, కొత్త ఆయకట్టుదారుల వివరాలను వీఆర్‌ఓలు సేకరిస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాల కిందవున్న విస్తీర్ణం, ఆయకట్టుదారుల సమాచారం క్రోడీకరించి తాజా పర్చనున్నారు. గత ఎన్నికల నాటికి ఓటరుగా ఉన్న ఆయకట్టుదారులు, తమ భూమిని ఇతరులకు అమ్ముకుంటే, వారి స్థానంలో కొత్త రైతును ఓటరుగానమోదుచేయనున్నారు. మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించి, ప్రస్తుత ఆయకట్టుదారులను ఓటర్‌గా చేర్చనున్నారు. ఆయకట్టుదారులు తమ భూములకు నీటి తీరువా చెల్లింపును పరిశీలించనున్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు నీటిపారుదలశాఖాధికారులు సమాయత్తమవుతున్నారు. భవిష్యత్తులో కాలువల నిర్వహణ, పూడికతీత, జలాశయాల మరమ్మతు పనులు ఎన్నికైన సంఘాలు చేపట్టనున్నాయి.

పోర్టు హాస్పిటల్‌ను ప్రయివేటుకివ్వొద్దు

అందించాలని డిమాండ్ చేశారు. 11న పోర్టు హాస్పిటల్‌వద్ద చేపట్టే నిరసనలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా తపాలా శాఖ వారోత్సవాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : తపాలా శాఖ జాతీయ వారోత్సవాలను బుధవారం బీచ్ రోడ్డులో నిర్వహించారు. విశాఖపట్నం పోస్టల్ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ డిఎస్‌వి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యాన విశాఖపట్నం పోస్టల్ సిబ్బంది 'ఫిట్ పోస్ట్ ఫిట్ ఇండియా' పేరిట పోస్టల్ రిలే వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావురెడ్డి మాట్లాడుతూ, పోస్టల్ శాఖకు సంబంధించిన వివిధ రకాల పథకాలను ప్రజలు వినియోగ పరుచుకోవాలని కోరారు. చిన్న, మధ్య తరహా వ్యాపారులు పోస్టల్ శాఖ డాక్ ఘర్ నిర్యాత్ కేంద్రం, స్పీడ్ పోస్ట్, ఐబిపిఎస్, బిజినెస్ పార్సెల్ సౌకర్యాలను వినియోగించుకోవాలని సూచించారు. పోస్టల్ వారోత్సవాల్లో భాగంగా 'మా కే నామ్ ఏక్ పేడ్' కార్యక్రమాన్ని చేపట్టి 200 మొక్కలను పోస్ట్ ఆఫీస్ ఆవరణల్లో నాటినట్లు తెలిపారు. 10వ తేదీన విశాఖపట్నం డివిజన్ పరిధిలో ఉన్న విశాఖ హెడ్ పోస్ట్ ఆఫీస్, వాల్తేరు రైల్వే స్టేషన్ హెడ్ పోస్ట్ ఆఫీస్, డాబాగార్డెన్స్ సబ్ పోస్ట్ ఆఫీస్, మధురవాడ సబ్ పోస్ట్ ఆఫీస్‌లో ప్రత్యేక ఆధార్ మేళాలు జరగనున్నాయని, ఆధార్ నమోదు కేంద్రం కలిగిన ఇతర పోస్టాఫీసులలో ఆధార్ నమోదు, సవరణలు చేయనున్నట్లు వివరించారు.

రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

డిఆర్‌ఎంకు సిఐటియు వినతి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైల్వే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని బుధవారం ఈస్ట్ కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు రైల్వే డిఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జివిఎంసి 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సమస్యలను డిఆర్‌ఎమ్‌కు వివరించారు. రైల్వే ఒబిహెచ్ఎస్ కార్మికుల పెండింగ్ 4 నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని కోరారు. వాల్తేర్ డివిజన్ పరిధిలో కాంట్రాక్టు కార్మికులకు జీతాలు అతి తక్కువగా ఇస్తున్నారని, లేబర్ యాక్ట్ ప్రకారం ఇవ్వటం లేదని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో కార్మికులకు రోజుకు రూ.400 చొప్పున ఇస్తున్నారని, లేబర్ యాక్ట్ ప్రకారం అన్ స్కిల్డ్ కార్మికునికి రోజుకు రూ.655 ఇవ్వాలని చట్టం చెబుతుందని వివరించారు. ఈ చట్టాన్ని రైల్వే స్టేషన్‌లో కాంట్రాక్టర్లు అమలుచేయడం లేదని, తక్షణమే కార్మికుల జీతాలపై దృష్టి సారించి చట్ట ప్రకారం జీతాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైల్వే అన్ని డిపార్ట్‌మెంట్లలో ఎక్కడా కాంట్రాక్టర్లు లేబర్ యాక్ట్ ఫాలో అవ్వట్లేదు అని, అన్నిచోట్ల చట్ట ప్రకారం జీతాలు, ఐడెంటిటీ కార్డులు, జీతం పే స్లిప్పులు, ఫైనల్ సెటిల్మెంట్, పిఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వెంటనే రైల్వే కాంట్రాక్టర్లతో, యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డియర్‌ఎమ్‌ను కోరారు. దీనిపై డిఆర్‌ఎం స్పందిస్తూ యూనియన్ కోరినవిధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు బి.జగన్, జనరల్ సెక్రెటరీ ఒ.అప్పారావు, ప్రెసిడెంట్ జి.శ్రీనివాసరావు, నాయకులు హరి తదితరులు పాల్గొన్నారు.

డిఆర్ఎం సౌరభ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న గంగారావు తదితరులు

సిఎస్ఆర్ నిధులతో నిరాశ్రయుల షెల్టర్ల అభివృద్ధి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఎస్ఆర్ నిధులు రాబట్టి నగర పరిధిలో ఉన్న నిరాశ్రయుల షెల్టర్లలో సమస్యలు, ముఖ్యంగా మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్ తెలిపారు. నిరాశ్రయుల షెల్టర్ల పరిశీలనలో భాగంగా బుధవారం టిఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని ఎయుటిడి షెల్టర్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా షెల్టర్ల నిర్వాహకులతో మాట్లాడుతూ, ప్రస్తుతం ఢిల్లీలో ఉన్న జివిఎంసి కమిషనర్ వచ్చిన తర్వాత షెల్టర్ల నిర్వహణ, నిధులు మంజూరుపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. షెల్టర్లకు ఇవ్వాల్సిన పెండింగ్ నిధులు ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎయుటిడి టిఎస్ఆర్ షెల్టర్ ఎదుర్కొంటున్న నీటి సమస్య, భీమ్ నగర్ షెల్టర్‌లో పాడైపోయిన మరుగుదొడ్ల సమస్యలను ఎయుటిడి కార్యదర్శి ప్రగడ వాసును అడిగి కలెక్టర్ తెలుసుకున్నారు. భూపేష్ నగర్ షెల్టర్ 2016 నుంచి ఎలాంటి కార్యక్రమాలు చేయకపోవడం, బుచ్చిరాజుపాలెం షెల్టర్ అడ్డదారిలో మమత చారిటబుల్ ట్రస్ట్ కైవసం చేసుకోవడం, రెడ్ క్రాస్ నడుపుతున్న రెండు షెల్టర్ల సమస్యలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జివిఎంసి క్రికెట్ జట్టు ఘన విజయం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖ నగరంలోని కోర్టు మైదానంలో జరిగిన క్రికెట్ మ్యాచ్‌లో జివిఎంసి జట్టు అద్భుత విజయం సాధించిందని జివిఎంసి అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి తెలిపారు. కోర్టు మైదానంలో బుధవారం జరిగిన విడిసిఏ ఇనిస్టిట్యూషన్ ఫుల్ "సి" గ్రూప్ మ్యాచ్లో జివిఎంసి క్రికెట్ జట్టు పది వికెట్ల తేడాతో విజయం సాధించిందని పేర్కొన్నారు. ముందుగా బ్యాటింగ్ చేసిన విపిటిఎస్‌సి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఆరు వికెట్లు నష్టపోయి 97 పరుగులు సాధించిందని తెలిపారు. జివిఎంసి జట్టు క్రికెటర్ ప్రకాష్ రెండు వికెట్లు తీశారని, అనంతరం బ్యాటింగ్ చేసిన జివిఎంసి జట్టు 13.4 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా 100 పరుగులు సాధించి విజయాన్ని పొందిందని పేర్కొన్నారు. జివిఎంసి తరుపున బ్యాటింగ్ చేసిన ప్రశాంత్ 52, సునంద 40 పరుగులు చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులను, టీమ్ మేనేజర్‌ను జివిఎంసి కమిషనర్, అదనపు కమిషనర్ అభినందించారు.

ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం వద్దు : కలెక్టర్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : చిన్నచిన్న సమస్యలను సాకుగా చూపుతూ ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం ప్రదర్శించటం సరికాదని, మనసు పెట్టి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, ఇళ్ల నిర్మాణాల్లో ఊహించని పురోగతి సాధించాలని హితవు పలికారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్, గ్రామీణ పథకాలపై కలెక్టరేట్‌లో బుధవారం ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణాల స్థితిగతుల గురించి ఆరా తీసిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. అందరూ సమన్వయంతో పనిచేసి నిర్మాణాల్లో జోరు పెంచాలన్నారు. రోజుకు 90 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ ప్రణాళికాయుతంగా పని చేయాలని చెప్పారు. వచ్చే వారం నాటికి జీరో రిజల్ట్ ఉన్న లే-అవుట్ జిల్లాలో ఉండడానికి వీలులేదని, అన్ని లేవుట్లలో పనులు జరగాల్సిందేనని నిర్దేశించారు. మండల, లే-అవుట్ల ప్రత్యేక అధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఎడిసిలు రమణమూర్తి, వర్మ, యుసిడి పీడీ ఫణిరాం, హౌసింగ్ డిఇలు, ఎఇలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

హౌసింగ్‌పై సమీక్షిస్తున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్

భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గం దొండపర్తి జగన్నాధపురం బ్రిడ్జి ఏరియాలో బుధవారం ఆంధ్రప్రదేశ్ భవననిర్మాణ కార్మిక సంఘం (ఎఐటియుసి) కార్యాలయాన్ని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భవన నిర్మాణ రంగంలో పనిచేస్తూ అనేక సమస్యలతో సతమతమవుతున్న కార్మికులు సమస్యల పరిష్కారానికి ఈ కార్యాలయం కేంద్రం కావాలన్నారు. కష్టాల్లో ఉన్న కార్మికుల ఆదుకోవడం కోసం ఏర్పడిన భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో కోట్ల రూపాయలు ఉన్నప్పటికీ గత ప్రభుత్వం ఆ సొమ్మును దారి మళ్లించి, భవన నిర్మాణ కార్మి ద్రోహం చేసిందన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేస్తామని, ఉచిత ఇసుక సరఫరా చేస్తామని ఎన్నికల సమయంలో కూటమి ముఖ్య నేతలు వాగ్దానాల వర్షం కురిపించారని, అధికారం చేపట్టి 100 రోజులు దాటినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని ఆరోపించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
E.P. 152/2023 in O.S.123/2023
Between:
Bevara Venu ...D.Hr/Plaintiff
And
Badidhaboyana Adilakshmi ...J.Dr/Defendant
NOTICE
To,
J.Dr/Defendant:
Badidhaboyana Adilakshmi,
W/o. B. Appa Rao,
R/at D.No.58-9-68, Karasa Area,
Marripalem, Visakhapatnam,(AP).
Please take notice that the above E.P is filed against of you for recovery of amount on the strength of decree. The said matter stands posted to **25-10-2024** for your appearance. If you have any objection you may attend either personally or through an Advocate before the above said Court at **10:30 A.M** on **25-10-2024,** failing which the matter will be decided exparte in your absence.
(By Order of the Hon'ble Court)
KILLI KUMAR, Advocate
D.No.5-74, Netaji Street,
Gopalapatnam.
Visakhapatnam-27

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P No.4/2024
బిట్వీన్ : యల్లపు జ్యోతిసంతోషి & వగైరాలు ...పిటీషనర్స్
అండ్ :
నిల్ ...రెస్పాండెంట్స్
జనరల్ నోటీసు
పై నెంబరు కేసులో విల్లూరి సీతారామస్వామి నాయుడు మరియు అతని భార్య విల్లూరి నాగమణి చనిపోయిన కారణంగా వారికి చెందిన Voltas Pvt. Ltd. కంపెనీ షేర్లు, వారి కుమార్తెలైన 1. యల్లపు జ్యోతి సంతోషి 2. కాండ్రేగుల లక్ష్మీపార్వతి 3. బొడ్డేడ లక్ష్మీకాంతం తీసుకొనుటకు సక్సనన్ సర్టిఫికేట్ ఇప్పించమని కోరుచూ పై కేసు దాఖలు చేసియున్నారు. సదరు విషయంపై ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో **తేది.05-11-2024దిని ఉదయం 10-30 ని॥లకు** మీరు పై కోర్టులో హాజరై తెలుపుకొవలెను లేనిచో పరోక్షమందు పై కేసు తీర్మానించబడును.
వై.ఎస్.ఆదిత్య
అడ్వకేట్, అనకాపల్లి

IN THE HONOURABLE COURT OF IV ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
O.S.No.155 OF 2024
Between :
M. Ravi Srinivas .... Plaintiff
And
Nagavarapu Srinivasa Rao ... Defendant
SUMMONS
To
Nagavarapu Srinivasa Rao,
S/o. Satyanarayana, Hindu, aged 42 years, D.No.50-53-1/4, Madhuranagar, Seethampeta, Visakhapatnam
Please take notice that the above named plaintiff filed suit against you for recovery of money. You are hereby required to appear before the court on **24-10-2024 at 10.30 AM.,** in person or by pleader duly instructed and able to answer all material questions relating to the above proceedings. Also take notice that in default of your appearance on the aforesaid day the issues will be settled and the suit will be heard and determined in your absence. You shall also bring with you or send by your pleader any documents which the plaintiff desires to respect and any documents on which you intend to rely in support of your defence. You are required to file a defence into court on or before the day of **24-10-2024.**
(By Order of the Honourable Court of IV Additional Junior Civil Judge at Visakhapatnam in O.S.No.155 of 2024)
Visakhapatnam, Dt : 09-10-2024
Sri M V S ANIL KUMAR RAJAGIRI
SRI G. NAGAPRASAD
SRI M. VENKATESH
ADVOCATES
D.No.45-46-22, Srinivasanagar, Akkayyapalem, Visakhapatnam-530016.
Ph : 99854 74741, 95336 85898
Email id : rmvsanil@gmail.com

మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ పరిశీలన

పరిశీలిస్తున్న వియంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : వియంఆర్‌డిఎ మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా బుధవారం సిరిపురం జంక్షన్లో నిర్మిస్తున్న మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ కాంప్లెక్స్‌ను సందర్శించారు. ప్రస్తుతం జరుగుతున్న పనులకు గడువులోగా పూర్తి చేసేందుకు అవసరమైన వస్తు సామగ్రిని సిద్ధం చేసుకొని త్వరితగతిన పనులను పూర్తి చేయాలని గుత్తేదారులను ఆదేశించారు. వచ్చే నెలాఖరు నాటికి వాణిజ్య సముదాయం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రణాళికా విభాగపు సమీక్షా సమావేశంలో పాల్గొని పెండింగ్ కోర్టు కేసులకు త్వరమే కౌంటర్స్ ఫైల్ చేయాలని, వేగవంతంగా దస్త్రాలను క్లియర్ చేయాలని, ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయవద్దని సిబ్బందిని హెచ్చరించారు. పర్యటనలో ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, పర్యవేక్షక ఇంజనీర్ బలరామరాజు, చీఫ్ అర్బన్ ప్లానర్ శిల్ప, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

భూసార పరీక్షా ఫలితాల కార్డులు అందుకున్న రైతులు

ప్రజాశక్తి -తగరపువలస : మండలంలోని చిప్పాడ రెవెన్యూ పరిధి కంచేరుపాలెం, పెద నాగమయ్య పాలెం గ్రామాల్లో భీమిలి మండల వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించారు మండల వ్యవసాయ శాఖ అధికారి బి శివ కోమలి మాట్లాడుతూ, భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువులు వాడాలని రైతులకు సూచించారు. ఈ సందర్భంగా భూసార పరీక్షా ఫలితాల కార్డులను రైతులకు అందజేశారు.

మత్స్య శాఖ అధికారులు మాట్లాడుతూ, సాంప్రదాయ పడవలను, మోటారు బోట్లుగా మార్చుకునేందుకు 40 శాతం సబ్సిడీ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఈశ్వరమ్మ, మాజీ జెడ్‌పిటిసి ఎస్ అప్పారావు, తాళ్ళవలస ప్రభుత్వ పశు వైద్యశాల డాక్టర్ ఎస్‌జి ప్రశాంతి, ఆర్‌ఎస్‌కె సిబ్బంది స్రవంతి, వాసంతి పాల్గొన్నారు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

అధికారులకు జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశం

ఆనందపురం మండలంలో సుడిగాలి పర్యటన

గృహ నిర్మాణ లేఅవుట్లు, ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి -ఆనందపురం : ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ సంబంధిత హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆనందపురం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. గిడిజాల, కనమాం గ్రామాల్లోని ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణ లేఅవుట్లను సందర్శించారు. అక్కడ జరుగుతున్న గృహనిర్మాణాల స్థితిగతులను పరిశీలించారు. లేఅవుట్లో ఎన్ని ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి, ఇప్పటి వరకు పూర్తయ్యాయి, మిగిలిన వాటి స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్ విస్తీర్ణం, అప్రోచ్ రోడ్లు, మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. ఇళ్ల నమూనాలను పరిశీలించిన ఆయన, లోపలికి వెళ్లి చూశారు. శ్లాబ్, కిటికీలు, కాంక్రీట్ పనులను క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. అందరూ బాధ్యతగా వ్యవహరించి, నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు కార్యక్రమంలో పలువురి లబ్ధిదారులతో మాట్లాడారు. వారి అభిప్రాయాలు సేకరించారు. పర్యటనలో కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ ఆళ్ల శ్రీనివాసు, ఎడిసి రమణమూర్తి, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన

మండలంలోని కణమాం, గిడిజాల రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్రీహోల్డ్ చేసిన భూములను కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌పరిశీలించారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. వారికి భూమి సంక్రమించిన విధానం.. తర్వాత జరిగిన పరిణామాలపై ఆరా తీశారు. స్థానిక రెవెన్యూ అధికారులు దగ్గరుండి ఫ్రీహోల్డ్ జరిగిన ప్రాంతాలను చూపించారు. అక్కడి పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు. స్థానిక తహశీల్దార్ శ్యాంప్రసాద్, ఉప తహశీల్దార్ ఎల్ చేతన్‌కుమార్, మండల సర్వేయర్, ఇతర సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు బజారులో రాయితీపై టమోటా విక్రయాలు

టమోటా స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ప్రజాశక్తి -గోపాలపట్నం: గోపాలపట్నం రైతుబజార్లో సబ్సిడీపై టమోటా విక్రయ స్టాల్స్‌ను, విశాఖ పశ్చిమఎమ్మెల్యే పి.గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ అకాల వర్షాలతో టమోటా పంటకు నష్టం వాటిల్లిన పరిస్థితుల్లో డిమాండ్‌కు తగ్గట్టుగా టమోటా ఉత్పత్తులు అందుబాటులో లేని పరిస్థితుల్లో ధర అనూహ్యంగా పెరిగిందన్నారు. ఈ ధరాభారాన్ని సామాన్య ప్రజలపై కొంత తగ్గించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వమే రైతుబజార్లలో రాయితీపై టమోటాలను అందుబాటు లోకి తెచ్చి విక్రయిస్తోందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు బాల సుబ్రహ్మణ్యం, నరిపిన్ని సత్తిరాజు, నరవ అనూష, దాడి రమేష్ నాయుడు, కొల్లి అప్పారావు, అల్లం రమేష్, అలజంగి శ్రీను, సునీల్, టిడిపి, జనసేన బిజెపి కార్యకర్తలు రైతు బజార్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయులో అమెరికన్ కార్నర్‌ను మరింత బలోపేతం చేస్తాం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆంధ్రవిశ్వవిద్యాలయంలో నెలకొల్పిన అమెరికన్ కార్నర్ సహాయంతో అమెరికాలో విశ్వవిద్యాలయాలు, విద్య విధానం, స్కాలర్‌షిప్‌లు, వీసా పొందే విధానం తదితర అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించాలని ఎయు విసి ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. బుధవారం అమెరికన్ ఎంబసీ నుంచి వచ్చిన పబ్లిక్ డిప్లమసీ ఆఫీసర్ ఎమీలియా, పబ్లిక్ ఎంగేజ్‌మెంట్ స్పెషలిస్ట్ సెంథిల్ కుమార్‌లతో కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విసి ఆచార్య శశిభూషణరావు మాట్లాడుతూ ఎయు గ్లోబల్ వర్సిటీగా నిలుస్తోందన్నారు. ఇక్కడ 64 దేశాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని వివరించారు. అమెరికన్ కార్నర్‌ను మరింత బలోపేతం చేస్తామన్నారు. ఎయు రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్ ధనుంజయరావు మాట్లాడుతూ అమెరికన్ కార్నర్‌ను యువతకు మరింత చేరువ చేసే కార్యక్రమాలను నిర్వహిస్తామ న్నారు. వర్సిటీలోని విభిన్న విభాగాలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను చేపడతామన్నారు. డ్యూయల్ డిగ్రీ కోర్సుల నిర్వహణ దిశగా సైతం తమకు ఆలోచన ఉందన్నారు.

విశాఖ స్టీల్ ఉత్పత్తులతో నిర్మాణ వ్యయం అదుపు

గీతం సదస్సులో ఆర్ఐఎన్‌ఎల్ నిపుణుల వెల్లడి



స్టీల్‌ప్లాంట్ నిపుణులను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : శ్రేష్టత, నాణ్యత ప్రమాణాలకు పేరెన్నికగన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ (ఆర్ఐఎన్‌ఎల్) ఉత్పత్తులను నిర్మాణ రంగంలో వాడితే, అనవసర వ్యయాన్ని తగ్గించడానికి ఆస్కారం ఉంటుందని ఆర్ఐఎన్‌ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ నిపుణులు వెల్లడించారు. బుధవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం టెక్నాలజీ ఎనేబులింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆర్ఐఎన్‌ఎల్ మార్కెటింగ్ అధికారులు అజయ్‌సేన్, ఎ.కె.రామారావు, ద్వారం స్వామి పాల్గొని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలలో పాటిస్తున్న ఉన్నత ప్రమాణాలను విద్యార్థులకు వివరించారు. విశాఖ స్టీల్ ఉత్పత్తుల నాణ్యతను వివరించారు. నూరు శాతం శ్రేష్టమైన ముడి పదార్థాలను ఉపయోగించడం ద్వారా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తయారైన ఉత్పత్తులు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకుంటున్నాయని వెల్లడించారు. ఆర్ఐఎన్‌ఎల్‌లోని రోలింగ్ మిల్లులు, ఆటోమేటెడ్ ఫైలింగ్, స్ట్రాపింగ్ విభాగాలు ఇతర సాంకేతిక వ్యవస్థలు ఉత్తమమైన స్టీల్ ఉత్పత్తులను ప్రపంచానికి అందించడానికి దోహద పడుతున్నాయని వివరించారు. ఈ సందర్భంగా వారు విశాఖ స్టీల్ ప్లాంట్ మార్కెటింగ్ వ్యూహాలను, డీలర్ల నియామకం, ఇ-సువిధ, ఇ-ఆక్షన్, గ్రామీణ ప్రాంతాలలో డీలర్ల ఎంపిక, ఎగుమతి నిబంధనలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ తెలుగు వారు గర్వించతగ్గ ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు పరిశ్రమ అన్నారు. స్టీల్ ప్లాంట్‌లోని వివిధ విభాగాలలో ఉపయోగిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ విధానాలు ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికి ఎంబిఎ వంటి కోర్సులు చదివేవారికి మార్గదర్శకంగా ఉపయోగపడతా యన్నారు. పరిశ్రమలతో విద్యాసంస్థలకు అనుబంధం ఏర్పడటం వల్ల వృత్తి విద్యను అభ్యసించే యువతలో నైపుణ్యం పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. గీతంలోని ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఆర్కిటెక్చర్ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా

శ్రీకాకుళం, విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : దసరా పండుగ సీజన్లో ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి, రైల్వే విజయవాడ, శ్రీకాకుళం రోడ్, విజయవాడ మధ్య ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. 07215 విజయవాడ-శ్రీకాకుళం రోడ్ ప్రత్యేక రైలు ఈనెల 9, 10, 11, 12, 14, 15, 16, 17 తేదీల్లో రాత్రి 8గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 1.28 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది, అక్కడి నుంచి 1.30 గంటలకు బయలుదేరి, తెల్లవారుజామున 5:30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది.

07216 శ్రీకాకుళం రోడ్ - విజయవాడ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 10, 11, 12, 13, 15, 16, 17, 18 తేదీల్లో ఉదయం 6.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డులో బయలుదేరి ఉదయం 9:30 గంటలకు దువ్వాడ చేరుకొని, మరల 09:32 గంటలకు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు విజయవాడ, శ్రీకాకుళం రోడ్ స్టేషన్ల మధ్య ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారపూడి, అనపర్తి, సామర్లకోట, అన్నవరం, తుని, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, పెందుర్తి, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి, పొందూరు స్టేషన్లలో ఆగుతాయి..

సైబర్ నేరాలను అరికట్టాలి

ప్రజాశక్తి- మాధవధార :సైబర్ నేరగాళ్లను నియంత్రించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ, ఒబిసి విభాగం మాజీ చైర్మన్ మూల వెంకటరావు అన్నారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో దేశవ్యాప్తంగా సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, వ్యవస్థీకృత దందాగా మారిన సైబర్ నేరాలకు ఉన్నత విద్యావంతులు, వ్యాపారులు బలి అవుతున్నారన్నారు..సైబర్ నేరాల నియంత్రణకు మండలానికొక సైబర్‌సెల్ పోలీసు పాయింట్‌ను ఏర్పాటు చేయాలని, ఆన్‌లైన్ మోసాలను అడ్డుకునేందుకు సైబర్ కమాండోలను సిద్ధం చేయాలని కోరారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో సైబర్ మోసాలను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన, చైతన్యానికి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. బెలికం వ్యవస్థలో ఉన్న లోపాలు సరిదిద్ది అత్యాధునిక సాంకేతికను ఉపయోగించి సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మూల వెంకటరావు కోరారు.

దాతలకు సత్కారం

ప్రజాశక్తి -తగరపువలస :జివిఎంసి ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మ ఆలయ ఆవరణలో పది వారాలపాటు నిర్వహించిన అన్నసమారాధన ముగింపు సందర్భంగా అన్నదాన విరాళదాతలను ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్ర పటాలను బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు రంగూరి సీతారామ దొర , సిహెచ్ త్రినాథరెడ్డి, నందిక రమణ, దుక్క కృష్ణ, ఎర్నింటి రమణ, మూకాల శ్రీను, ఎం రాజు పాల్గొన్నారు

కెజిబివిలో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని నేలతేరు కెజిబివి పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ నాగమణి తెలిపారు. పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో జతపరిచిన పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను మండల విద్యాశాఖాధికారి కార్యాలయంతో అందజేయాలని సూచించారు. పూర్తి వివరాలకు ఎంఇఒ కార్యాలయంలో సంప్రదించాలన్నారు

విజయవాడ వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విజయవాడ వరద బాధితులకు ఆంధ్రా యూనివర్సిటీ స్టాఫ్ కోఆపరేటివ్ సొసైటీ తమ వంతుగా రూ.రెండు లక్షల ఆర్థికసాయాన్ని అందజేసింది. ఈ మేరకు ఎయు రిజిస్ట్రార్ ఇ.ఎన్.ధనుంజయరావుకు సొసైటీ ప్రతినిధులు ఆర్థికసాయం చెక్కును అందజేసి, ముఖ్యమంత్రి సహాయనిధికి పంపాలని కోరారు.

సాయం చెక్కును అందజేసిన వారిలో సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఎం.యుగంధర్, సెక్రటరీ సిహెచ్.లక్ష్మణబాబు, ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ కె.కిరణ్‌కుమార్, డైరెక్టర్లు ప్రొఫెసర్ వి.సిద్ధయ్య, కె.సోమేశ్వరరావు, షేక్ ఖాదర్‌బాబా, డాక్టర్ జివిఎస్.రవికుమార్, ఎన్.వి.గిరి, డి.గోవింద, మేనేజర్ ఆర్.వి.రమణ పాల్గొన్నారు.

వాలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సిఐటియు ఆధ్వర్యంలో గాజువాకలో ర్యాలీ, జెడసి కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-గాజువాక: వాలంటీర్లకు ఉద్యోగభద్రత కల్పనతోపాటు పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ, బుధవారం కొత్త గాజువాక నుంచి జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వాలంటీర్ల సంఘం ప్రధానకార్యదర్శి దీప్తి మాట్లాడుతూ ఐదేళ్లకుపైగా వాలంటీర్లుగా ప్రజలకు మెరుగైన సేవలను అందించామని, ముఖ్యంగా కరోనా సమయంలో కూడా ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవ చేశామన్నారు. ప్రభుత్వం మారిన వెంటనే తమను నిర్లక్ష్యం చేయడం సరికాదని, తమను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కమిటీ నాయకులు ఎం.రాంబాబు మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థను కొన సాగించడంతో పాటు నెలసరి రూ.పదివేలు వేతనం చెల్లిస్తామని ఎన్నికలకు ముందు విపక్ష నేతలుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ మాటిచ్చారని, ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలని కోరారు.వాలంటీర్ల కొనసాగింపు, వారి సమస్యల పరిష్కారంపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు ఎల్ బంగారం నాయుడు, గొలగాని అప్పారావు పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్నరాంబాబు

కేన్సర్‌పై అవగాహన

పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు అగనంపూడి, హోమీబాబా కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చి ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గురువారం వైద్యపరీక్షలతోపాటు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హోమీబాబా కేన్సర్ ఆసుపత్రి ఆంకాలజిస్టులు మాట్లాడుతూ, కేన్సర్ అనేది వ్యాధుల సమూహమని, శరీరంలో కణాలు గణనీయంగా పెరగడంతోపాటు ఇతర భాగాలకు వ్యాప్తిస్తుందన్నారు. శరీరంలోని ఏ భాగానికైనా కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. జీవనశైలిలో మార్పులు కేన్సర్‌కు కారణం కావచ్చన్నారు. కేన్సర్ లక్షణాలపై అవగాహన కలిగి, ప్రాథమిక స్థాయిలోనే దాన్ని గుర్తించగలిగితే, సత్వర చికిత్స ద్వారా తక్కువ ఖర్చు వైద్యంతోనే రోగి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ధూమపానం, మద్యపానం వంటి దురలవాట్లు మానుకోవాలని సూచించారు. కేన్సర్ నాలుగు దశల్లో ఉంటుందని, మొదటి స్టేజీలోనే మరణాల సంఖ్య తగ్గించొచ్చని సూచించారు. పారిశుధ్య కార్మికులకు కేన్సర్‌పై అవగాహన, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

పోటీతత్వాన్ని పెంపొందించుకోండి

శిక్షణలో మాట్లాడుతున్న ఎంఇఒ జయప్రద

ప్రజాశక్తి - తగరపువలస: విద్యార్థులు పోటీతత్వాన్ని పెంపొందించుకోవాలని ఎంఇఒ ఎ.జయప్రద పిలుపునిచ్చారు. బుధవారం చిట్టివలస జెడ్‌పి బాలుర ఉన్నత పాఠశాలలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ ఉచిత శిక్షణ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని సూచించారు.ఉచిత శిక్షణ ఇస్తున్న నిర్వాహకులను అభినందించారు.కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు రమణ, శ్రీనివాసరావు, భరత్ పాల్గొన్నారు

కొత్త ఆర్‌డిఒకు అభినందన

ఆర్‌డిఒను కలిసిన ఎస్‌సి,ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-ఆనందపురం: భీమిలి ఆర్‌డిఒగా కొత్తగా ఉద్యోగబాధ్యతలు చేపట్టిన సంగీత్‌మాధుర్ బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సభ్యులు బోనేల యోసేపు, జలగడుగుల శ్రీనివాస్, దుమ్మెద అప్పలసూరి, ప్రొఫెసర్ సుబ్బారాయుడు కలిసి పుష్పగుచ్ఛం అందించి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను గురించి ఆర్‌డిఒకు వివరించారు. ఆయా కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టి, బాధితులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ సంగీత్‌మాధుర్ స్పందిస్తూ, తగు చర్యలు చేపట్టి, వీలైనంత త్వరగా పరిష్కార చర్యలు చేపడతానన్నారు.

నిర్వాసిత కాలనీల అభివృద్ధికి కృషి

సామాజిక భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా

ప్రజాశక్తి-గాజువాక : అవసరమైన సౌకర్యాల కల్పన ద్వారా ఉక్కు నిర్వాసిత కాలనీల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు గాజువాక ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జివిఎంసి 75వ వార్డు నెల్లిముక్కులోకమ్యూనిటీ హాల్, ఓపెన్ జిమ్‌లను ఎమ్మెల్యే పల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని, గ్రామాల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. సామాజిక భవనాన్ని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కమ్యూనిటీ హాలులో గ్రంథాలయం ఏర్పాటు చేసి ప్రజల విజ్ఞాన, సమాచార అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు పులి రమణారెడ్డి, సిపిఐ నాయకులు యేల్లేటి శ్రీనివాసరావు, కోన చిన అప్పారావు, దొమ్మేటి అప్పారావు, ప్రసాదుల శ్రీనివాస్, ములకలపల్లి పెంటయ్య, పట్నాల కన్నయ్య, డి.రామునాయుడు, కె శంకరరావు, డి పెరుమాళ్ళు, అంజూరి దీపక్, నాగరాజు, వంగలపూడి శ్రీను, పులి సురేష్ రెడ్డి పాల్గొన్నారు.

బిసి కులగణన చేపట్టాలి

ధర్నాలో పాల్గొన్న విశాఖ బిఎస్‌పి నేతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : బిసి కులగణన చేపట్టాలన్న డిమాండ్‌తో విజయవాడ ధర్నా చౌక్ వద్ద బహుజన సమాజ్ పార్టీ నిర్వహించిన ఆందోళనలో విశాఖపట్నం జిల్లాకు చెందిన బిఎస్‌పి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి, బిసి కులగణన చేట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు పెదపెంకి శివప్రసాద్, రాష్ట్ర కోఆర్డినేటర్ లకే రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరణం తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శి బోని కృష్ణ, జిల్లా ఇన్‌ఛార్జి భీమరసెట్టి విశ్వనాథం, జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల ధనుంజయరావు, కోశాధికారి అతకంసెట్టి రామచంద్రరావు, కార్యదర్శి సవరాల రమేష్, కార్యవర్గ సభ్యుడు. తాతారావు, వి శాఖపట్నం నార్త్ ఇన్చార్జి పెద్దాడ కనకం మహాలక్ష్మి పాల్గొన్నారు

వ్యాక్సినేషన్‌ను డిఎంహెచ్ఒ పరిశీలన

ప్రజాశక్తి- సీతమ్మధార : నగరంలోని రేసపువానిపాలెం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని హరిజన వీధి సచివాలయాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు బుధవారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. లబ్దిదారులు, సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేసారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఆర్‌సిహెచ్ బ్యాక్ లాగ్స్ లేకుండా చూసుకోవాలని, పెద్దలకు బిసిజి వ్యాక్సినేషన్, ఆర్‌సిహెచ్ సేవలపై సూచనలు చేసారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఎఫ్ఆర్ఎస్ హాజరు విధిగా వేయాలని ఆదేశించారు. అభ యాప్ శతశాతం సాధించాలని, ఆధార్ నెంబర్ లేనిచో సంబంధిత ఆశా కార్యకర్తతో గృహ సందర్శన చేసి అభ యాప్ అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఎంపిహెచ్ఇఒ నాగభూషణం పాల్గొన్నారు.

ఉత్సాహంగా మండల స్థాయి కోలాటం పోటీలు

ప్రజాశక్తి- ఆనందపురం :భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అమ్మమ్మ పేరిట నెలకొల్పిన గంటా నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోమండలస్థాయి కోలాటం పోటీలు నిర్వహించారు. మండలంలోని పలుగ్రామాలకు చెందిన కోలాటం బృందాలను సీనియర్, జూనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించగా, ఎంపిడిఒ డాక్టర్ జానకి, తహశీల్దార్ శ్యామ్ ప్రసాద్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ల విభాగంలో ముచ్చర్ల మాస్టర్ గంగరాజు శ్రీరామ కోలాటం బృందం, జూనియర్ విభాగంలో చందక కంది సాయి మాస్టారు శ్రీజానకిరామ మహిళా కోలాట బృందాలు మొదటిస్థానాల్లో నిలిచాయి. ఆయా బృందాలు ఈనెల 12న భీమిలిలో ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించే తుదిపోటీల్లో పాల్గొంటా రన్నారు. నియోజకవర్గస్థాయిలో విజేతలుగా నిలిచిన కోలాటం బృందానికి రూ. 50,116, రెండోస్థానంలో నిలిచిన బృందానికి రూ.25,116, మూడోస్థానంలో నిలిచిన గ్రూపునకు రూ.15,116 నగదు బహుమతులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావ అందజేస్తారని నిర్వాహకులు తెలిపారు. సర్పంచులు, ప్రజాప్రతినిధులు పంచాయతీ కార్యదర్శులు, కళాకారుల బృందాలు పాల్గొన్నారు.

ఆనందపురంలో కోలాటం పోటీల్లో పాల్గొన్న బృందాలు

పద్మనాభం: పద్మనాభ మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో బుధవారం కోలాటం పోటీలు నిర్వహించారు. మండలంలోని 22 గ్రామపంచాయతీలకు చెందిన కోలాటం బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. సీనియర్స్ విభాగంలో కోరాడ పంచాయతీ గద్దపేట గ్రామానికి చెందిన శ్రీరామ మహిళా కోలాటం బృందం, జూనియర్స్ విభాగంలో పాండ్రంగి గ్రామానికి చెందిన. గ్రామదేవత జల్లమ్మ తల్లి కోలాటం బృందాలు ప్రథమస్థానంలో నిలిచాయి. ఆయా బృందాలు ఈనెల 12న. నారాయణమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భీమిలిలో నియోజకవర్గస్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు.

పోర్టు ఆసుపత్రి ప్రయివేటీకరణ ఆపే వరకు పోరాటం

ప్రజాశక్తి- సీతమ్మధార : పోర్ట్ హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపే వరకు తమ పోరాటం కొనసాగుతుందని యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్, సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం పోర్టు ఆసుపత్రి వద్ద యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎనిమిదో రోజు రిలే నిరాహారదీక్షలను ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్మికుల కష్టంతో విశాఖ పోర్టుకు రూ.వేల కోట్లలో లాభాలు వస్తున్నాయన్నారు. ఈ ఏడాది పోర్టుకు రూ.786 కోట్లు లాభాలరాగా అందులో రూ.171.42 కోట్లు ప్రభుత్వానికి పన్నులు రూపేణా కట్టామన్నారు. ఉద్యోగులు, కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పోర్టుకు వచ్చిన లాభాలతో ఆసుపత్రిని నిర్మించారని, ఇపుడు 50 ఏళ్ళ పూర్తయిన సందర్భంగా గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్‌గా రూపుదిద్దుకున్న క్రమంలో ఈ ఆసుపత్రిని పిపిపి విధానంలో అభివృద్ధి చేసేందుకు ప్రయివేటుకు కట్టబెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూడడం దుర్మార్గమన్నారు. ఆసుపత్రి నిర్వహణకు రాబోయే వందేళ్లకు సరిపడేంతగా రిజర్వ్ ఫండ్స్ పోర్ట్ వద్ద ఉన్న నేపథ్యంలో దీన్ని ప్రయివేటుకు కట్టబెట్టి పోర్టు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్యాన్ని దూరం చేయాలన్న కేంద్రం ఆలోచన దుర్మార్గమన్నారు. గోల్డెన్ జూబ్లీ ఆసుపత్రిని పోర్టు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉంటే,కార్మికులకు అప్పగిస్తే, తామే అభివృద్ధి చేసి నిర్వహించుకుంటామని, దీనికి ఇప్పటికే జిల్లాలోని కార్మిక, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతునిస్తూ సన్నద్ధంగా ఉన్నాయ న్నారు. పోర్టు ఆసుపత్రిని ప్రయివేటుపరం కాకుండా ఉద్యమాన్ని ప్రజాపోరాటంగా ఉధృతం చేసి, తామే రక్షించుకుంటా మన్నారు. దీక్షల్లో నాయుడు శంకరరావు, గణేష్, నర్సింగ రావు, విశ్రాంత ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

రిలే దీక్షల్లో పాల్గొన్న పోర్టు అండ్ డాక్ యూనియన్ ఉద్యోగులు

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలి

సిఐటియు ఆధ్వర్యాన నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-అనకాపల్లి

గ్రామ/ వార్డు వాలంటీర్లకు విధుల్లోకి తీసుకొని ఉద్యోగ భద్రత కల్పించాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సిఐటియు ఆధ్వర్యాన సంఘం జిల్లా కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు వాలంటీర్లు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం జంక్షన్‌లో మానవహారం చేశారు. తమ డిమాండ్లపై నినదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు పదివేల రూపాయలు జీతం ఇస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని తెలిపారు. ఆ హామీని అమలు చేయకపోగా, నాలుగు నెలల నుండి వేతనాలు ఇవ్వలేదన్నారు. తక్షణమే వాలంటీర్లకు నాలుగు నెలల జీతాల బకాయిలు విడుదల చేయాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వాలంటీర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు ప్రజలకు సేవ చేసిన వాలంటీర్ల పట్ల కూటమి ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. వాలంటీర్లు ఉండటం వల్లే ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ గతంలో ఇంటింటికీ చేరాయని, నేడు ఆ సంక్షేమ పథకాలు అమలు చేయడంలోనూ, లబ్ధిదారులకు చేరవేయడంలోనూ ఈ ప్రభుత్వం అలసత్వం వహిస్తుందని విమర్శించారు. వాలంటీర్లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోరాటానికి సన్నద్ధం కావాలని వాలంటీర్లకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ల సంఘం జిల్లా కన్వీనర్ షేక్ పీర్ సాహెబ్, కో కన్వీనర్ తాడి కిరణ్, నాయకులు పి లలిత, కే సంతోషి, పైల అప్పలనాయుడు, జి శ్రీను, వివిధ మండలాలకు చెందిన వాలంటీర్లు పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యాన నిరసన ర్యాలీ చేస్తున్న వాలంటీర్లు

బత్తుల తాతయ్యబాబును సత్కరిస్తున్న నాగజగదీష్ తదితరులు

బత్తుల తాతయ్యబాబుకు నాగజగదీష్ సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా బుధవారం వడ్డాదిలోని ఆయన స్వగృహంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు శాలువాతో సత్కరించి, నూకాంబికా అమ్మవారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ అనుబంధ సంస్థ నోబుల్ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల గోపికృష్ణ, ఉషోదయ విద్యా సంస్థల అధినేత జె.రమణాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కె.కోటపాడు : ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా అమలు చేస్తున్న పలు రాయితీలను వినియోగించుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు. మండలంలోని మర్రివలస, సూదివలస గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూదివలసలో చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు వి రవీంద్రనాథ్ ప్రభుత్వం చెపట్టిన వ్యవసాయ కార్యక్రమాలను వివరించారు. కాయకూర పంటలకు రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. మండల ఉద్యాన శాఖ అధికారి కిరణ్మయి మాట్లాడుతూ మామిడిలో దిగుబడులు ఆశజనకంగా ఉండాలంటే తీసుకోవలసిన జాగ్రత్తలను, సూక్ష్మ పోషక లోపాలను నివారించుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మర్రివలస ఎంపీటీసీ కోటాన సూరిదేముడు, పొంతనపల్లి రవినాయుడు, సూదివలస ఉప సర్పంచ్ వర్రె కొండబాబు, వర్రె సన్యాసి నాయుడు, మొల్లి గంగునాయుడు, యాళ్ల సింహాచలం నాయుడు, మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, విహెచ్‌ఏ సౌజన్య సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

ముగ్గులను పరిశీలిస్తున్న ఎంపిపి వెంకటపద్మ లక్ష్మి

ప్రజాశక్తి-పరవాడ

మండల కేంద్రం పరవాడలో బొంకులదిబ్బ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మంగళవారం రాత్రి దుర్గాదేవి నవరాత్రుల మహోత్సవం సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సుమారు 40 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. ఐదుగురు విజేతలుగా నిలిచారు. ఈ ముగ్గులు పోటీలను ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ పర్యవేక్షించి విజేతలను ప్రకటించారు. మొదటి బహుమతి జి.భాగ్యవతి, రెండవ బహుమతి కే తులసి, మూడోవ బహుమతి పి లక్ష్మి, నాలుగోవ బహుమతి కె. ప్రణీత, ఐదవ బహుమతి పి.రాము గెలుచుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మహిళలలో దాగి ఉన్న కలను గుర్తించి బహుమతులు ద్వారా ప్రోత్సహించడానికి ఇలాంటి ముగ్గులు పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తున్న బొంకులదిబ్బ యూత్ సభ్యులను అభినందించారు. విజేతలకు ఈ 12న శనివారం సాయంత్రం బొంకులదిబ్బ స్టేజి వద్ద బహుమతులు అందజేస్తారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు పైల వెంకటరావు, పైల హరీష్, వైసిపి నాయకులు చీపురుపల్లి శ్రీనివాసరావు, పైల పైడం నాయుడు, గండి మహేష్, లాలం ముత్యాలు నాయుడు, బొంకులదిబ్బ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

22 మద్యం షాపులకు 160 దరఖాస్తులు

ప్రజాశక్తి-కె.కోటపాడు

చోడవరం సర్కిల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న 22 మద్యం దుకాణాలకు నేటి వరకు 160 దరఖాస్తుల అందాయని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పాపునాయుడు తెలిపారు. చోడవరం మండలంలో ఉన్న ఎనిమిది మద్యం దుకాణాలకు 36 దరఖాస్తులు బుచ్చయ్యపేటలో ఐదు మద్యం దుకాణాలకు 51 దరఖాస్తులు, కె.కోటపాడు మండలంలోని ఐదు మద్యం దుకాణాలకు 40, దేవరాపల్లి మండలంలో ఉన్న నాలుగు షాపులకు 29 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం ఈనెల 11 వరకు దరఖాస్తుల గడువు పొడిగించినందున మరిన్ని దరఖాస్తులు రావచ్చని పేర్కొన్నారు. ఈనెల 14వ తేదీన లాటరీ తీసి లైసెన్సులు ఖరారు చేయడం జరుగుతుందని, 16వ తేదీ నుండి కొత్త లైసెన్స్ దారులు దుకాణాలు ప్రారంభించుకోవచ్చని ఆయన తెలిపారు.

శరవేగంతో డ్రైనేజీ నిర్మాణ పనులు

ప్రజాశక్తి- సబ్బవరం

జివిఎంసి 88వ వార్డులో డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ పనులను బుధవారం 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు నాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు పరిధిలో రూ.6.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగా సబ్ జోనల్ ఆఫీస్ నుండి మాజీ సర్పంచ్ సారిపల్లి పైడిరాజు ఇంటి వరకు రూ.19.80 లక్షలతో ఎస్‌డబ్ల్యూ డ్రైనేజీ పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14 నుండి 20 వరకు వెదుళ్ల నరవ, కొత్తూరు, గంగవరం, నంగినారపాడు, అజనగిరి, దువ్వాడ తదితర గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు.

ఉపాధి హామీ పనులపై గ్రామసభ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

మండలంలోని పి.భీమవరం గ్రామంలో ఉపాధి హామీ పనులను గుర్తించడానికి బుధవారం స్థానిక సర్పంచ్ రామునాయుడు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిటిసి దేవర అప్పారావు మాట్లాడుతూ రాబోయే ఏడాదికి చేపట్టవలసిన పనులను గ్రామ ప్రజల సహకారంతో గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ ఆనందరావు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామసభలో పాల్గొన్న మహిళలు

నిత్యావసరాల ధరల నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి తెలిపారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిత్యావసర సరుకుల ధరల నియంత్రణపై సివిల్ సప్లయి, మార్కెటింగు, తూనికలు కొలతల శాఖల అధికారులు, హోల్ సేల్ వ్యాపారులు, షాపింగుమాల్స్ ప్రతినిధులతో జెసి జాహ్నవి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు నిత్యావసరాల ధరలు నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఉల్లిపాయలు, టమోటా, వంటనూనెలను ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కౌంటర్లలో సరుకులను సాధ్యమైనంత తక్కువ ధరలకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కృత్రిమ కొరత సృష్టించకుండా అధికారుల కమిటీ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. సరుకులు స్టాకు, అమ్మకాలపై రోజువారీ రిపోర్టు అందించాలని తూనికలు కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక కౌంటర్లలో సరుకులు విక్రయాలు చేయుటకు హోల్ సేల్ మార్కెట్లో సమాచారం సేకరించి సరుకులు ధరలు నిర్ణయించాలని మార్కెటింగు శాఖల అధికారులకు సూచించారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలితో పాటు మేజరు పంచాయతీలలో కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి టివిఎల్ఎన్.మూర్తి, జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ పి. జయంతి, మార్కెటింగు, తూనికలు కొలతల శాఖల అధికారులు, హోల్ సేల్ వ్యాపారులు, షాపింగుమాల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ధరల నియంత్రణకు ప్రత్యేక కౌంటర్లు

నిత్యావసర సరుకుల ధరల నియంత్రణ చర్యలలో భాగంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌర సరఫరాలు, మార్కెటింగు, లీగల్ మెట్రాలజీ శాఖల ఆధ్వర్యంలో అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలిలో సబ్సిడీ ధరలపై ఉల్లిపాయలు, టమోటా, వంటనూనెలు విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి హోల్ సేల్ మార్కెట్లలో, అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఉల్లిపాయలు కేజీ 60 రూపాయలకు, టమోటా 52 రూపాయలకు, పామోలిన్ ఆయిల్ లీటరు 117 రూపాయలకు, ఫ్రీడం సన్‌ఫ్లవర్ ఆయిల్ లీటరు 126 రూపాయలకు, వేరుసెనగనూనె 155 రూపాయలకు అమ్మకాలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గల మోర్, రిలయన్స్, డిమార్ట్, విశాల్ అవుట్ లెట్‌లలో కూడా ఇవే ధరలకు సరుకులు లభిస్తాయని చెప్పారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేకు పుష్ప గుచ్ఛం అందిస్తున్న తహశీల్దారు జనార్ధన్

ఎమ్మెల్యేను కలిసిన తహశీల్దారు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం మండల తహశీల్దారుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జనార్ధన్ బుధవారం ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. రెవెన్యూ పరంగా తలెత్తిన సమస్యలను పరిష్కారం చేయడానికి చొరవ చూపాలన్నారు.

నేడు బత్తుల బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు గురువారం విజయవాడ ఆటో నగర్ వద్దగల హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఆయన బుధవారం తెలిపారు. చంద్రబాబు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధవంతం గా నిర్వహిస్తానని చెప్పారు.

తిమ్మరాజుపేటలో చెత్త కుండీలు ఏర్పాటు చేసిన దృశ్యం

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేకమైన దృష్టి సారిస్తున్నట్లు ఆ గ్రామ సర్పంచ్ శరగడం భాగ్యలక్ష్మి బాపునాయుడు తెలిపారు. గ్రామంలో రహదారులపై పేరుకుపోయిన చెత్తను బుధవారం శ్మశాన వాటికలో కేటాయించిన స్థలంలోకి ట్రాక్టర్లపై తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు తమ ఇంటి వద్దనున్న చెత్తను కుండీలలో వేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రామ పరిసరాలు పరిశుభ్రంగా తయారు చేయటానికి సహకరించాలని కోరారు.

'ఈ-శ్రమ' కార్డులకు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ కార్డుల కోసం నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారి కూడ బాలకృష్ణ అన్నారు. ఏఐఎఫ్‌టియు (న్యూ) యూనియన్ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలం బొట్టువాడ డీలర్స్ కాలనీ ప్రాంతంలో వివిధ క్వారీలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులను ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ సంక్షేమ మండలిలో బుధవారం ఈ-శ్రమలో సభ్యత్వ నమోదు ప్రక్రియను బాలకృష్ణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులందరూ కార్మిక శాఖలో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు నాయకులు కోన మోహన్, కార్మికులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కార్మిక శాఖ అధికారి బాలకృష్ణ

యువతకు మార్గదర్శి చేగువేరా

డివైఎఫ్ఐ, సిఐటియు నేతలు శివాజీ, దేముడునాయుడు

ప్రజాశక్తి- రాంబిల్లి

ప్రపంచంలో ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ, ఏ అన్యాయం జరిగినా స్పందించాలని యువతకు దిశానిర్దేశం చేసి, ఆచరించి చూపించిన మార్గదర్శి చేగువేరా అని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శివాజీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేముడునాయుడు అన్నారు. చేగువేరా 57వ వర్థంతి సందర్భంగా డివైఎఫ్ఐ, సిఐటియు ఆధ్వర్యంలో రాంబిల్లి మండలం గజిరెడ్డిపాలెం గ్రామంలో చేగువేరా చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు వై రాము అధ్యక్షతన జరిగిన సభలో శివాజీ, దేముడునాయుడు మాట్లాడుతూ చే గువేరా ఏ ఒక్క దేశానికో చెందిన విప్లవకారుడు కాదని, యావత్ ప్రపంచానికి కొత్త శక్తినిచ్చిన యోధుడని పేర్కొన్నారు. 1928 జూన్ 14న అర్జెంటీనాలోని రోజలియోలో జన్మించిన చేగువేరా బాల్యంలో ఆస్తమా బాధితుడని, దీంతో అతడికి ఏమవుతుందోనని భయపడుతూ అతని తల్లిదండ్రులు నిద్రలేని రాత్రులు గడిపేవారని, అయితే ఆయన పెరిగి పెద్దయ్యాక నియంతలకు నిద్ర లేకుండా చేశాడని తెలిపారు. వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడే మోటారు సైకిల్‌పై లాటిన్ అమెరికా మొత్తం పర్యటించాడని, ఆ ప్రయాణమే ఆయన జీవితాన్ని మార్చేసిందని పేర్కొన్నారు. అప్పుడే లాటిన్ అమెరికాలోని బానిసల జీవితాలలో వెలుగులు నింపాలని నిర్ణయించుకొని ఆ దిశగా పయనించాడని తెలిపారు. చేగువేరా ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమంటే ఆయన అడుగుజాడల్లో నడవడమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేపల చిట్టిబాబు, మాజీ సర్పంచ్ చెల్లూరి నూకరాజు, ఎరిపిల్లి చక్రవర్తి, ఎరిపిల్లి చిరంజీవి, వెంకటేష్, రాజేశ్వరి, నూక రత్నం, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

చేగువేరా చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న డివైఎఫ్ఐ, సిఐటియు నాయకులు

కార్యకర్తలకు అందుబాటులో ఉంటా

ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి-కె.కోటపాడు

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో చోడవరంలో క్యాంప్ కార్యాలయం ప్రారంభించినట్లు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు పరవాడ మండలం వెన్నెలపాలెంలోని తన స్వగృహం నుండి మాడుగుల నియోజకవర్గానికి నిత్యం రాకపోకలు సాగిస్తున్నానని చెప్పారు. దీని వల్ల తను నియోజకవర్గంలోకి రావాలన్నా... కార్యకర్తలు వెన్నెలపాలెం వెళ్లాలన్నా అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటిని దృష్టిలో ఉంచుకొని మాడుగుల నియోజకవర్గం పరిధిలోని కె.కోటపాడు, దేవరాపల్లి, చీడికాడ, మాడుగుల మండలాలకు సమాన దూరంలో ఉన్న చోడవరంలో క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యాలయంలో తను 24 గంటలు కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డ్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, టిడిపి నియోజకవర్గం నాయకులు పివిజి కుమార్, పైలా ప్రసాదరావు, బండారు అప్పలనాయుడు, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

దుర్గాదేవిని దర్శించుకున్న నాయకులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట

బుచ్చయ్యపేట మండలం రాజాం గ్రామంలో దేవి నవరాత్రుల 26వ మహోత్సవం సందర్భంగా బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు సతీసమేతంగా కుటుంబ సభ్యులతో విచ్చేసి దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మరిశా సతీష్, మరిశా నరేష్, నాగులాపల్లి సత్యనారాయణ, షేక్ వల్లి, కంచిపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న వైసిపి నేత గండి రవికుమార్

అనకాపల్లి : స్థానిక శతకంపట్టు వద్ద వెలసిన కనకదుర్గమ్మను బుధవారం శాసన మండలి మాజీ సభ్యులు బుద్ద నాగ జగదీశ్వరరావు దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆహ్వాన కమిటీ ప్రతినిధి కాంగ్రెస్‌గుల నాయుడు నాగ జగదీష్‌ను శాలువాతో సత్కరించి అమ్మవారి షీల్డ్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోట్ని రామకృష్ణ, బొడ్డేడ మురళి, మల్ల గణేష్, దొడ్డి జగదీష్, రామోజీ, శ్యాంసుందర్, బుద్ద భువనేశ్వరరావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామ శివారులో దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వీరాంజనేయ యూత్ కమిటీ వారి ఆధ్వర్యంలో దుర్గాదేవి అమ్మవారికి స్థానిక వైసిపి నేత గండి రవికుమార్ బుధవారం పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ పెద్దలు రవికుమార్‌ను సన్మానించారు. అనంతరం అక్కడ సరస్వతీ పూజ చేసిన పిల్లలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి గండి దేముడు, వైసిపి నాయకులు యడ్ల నాయుడు, సిరపరపు వాసు, గండి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

పరవాడ : పరవాడలో దుర్గ దేవి నవరాత్రుల మహోత్సవాలలో భాగంగా బుధవారం యంగ్ మెన్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి పైల వెంకట పద్మాలక్ష్మి శ్రీనివాసరావు, పరవాడ మాజీ సర్పంచ్ చుక్కా రాము నాయుడు చేతుల మీదుగా దీనిని ప్రారంభించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : దసరా ఉత్సవాలు సందర్భంగా మండలంలోని మోసయ్యపేట గ్రామంలో బుధవారం అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అందలపల్లి కొండపై భగీరథ అమ్మవారి ఆలయంలో ప్రత్యేకమైన నవరాత్రులు పూజలు చేస్తున్నారు. తిమ్మరాజుపేట గ్రామంలో దుర్గాంబిక ఆలయంలో భక్తులు సహపంక్తి భోజనాలు చేశారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక విఫలం

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక విఫలమైందని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పాత్రపల్లి వీరు యాదవ్ విమర్శించారు. అనకాపల్లి ఉడ్డిపేటలో గల సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వికలాంగులు అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లాలంటే ఎన్నో వ్యయ ప్రయాసలు పడవలసి వస్తుందని, వెళితే అక్కడ సరైన సౌకర్యాలు, ర్యాంపులు లేవని, లిఫ్ట్ అనుకూలించడం లేదని తెలిపారు అవగాహన లేమితో కింది స్థాయి సిబ్బంది ఏ సమస్య ఎవరికి పంపాలో తెలియక సమస్యలు పక్కదారి పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కనీసం వికలాంగులపై మానవతా దృక్పథంతో అనకాపల్లి గాంధీ నగరంలో ఉన్న ఎస్ఆర్ శంకరన్ కాన్ఫరెన్స్ హాల్లో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మొల్లి చంద్రశేఖర్, కరణం శివ, కోనేటి భార్గవ్, దూళి శివ తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ఆర్ నిధులతో విద్యుత్ లైట్లు వేయించండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : ఎస్ఇజెడ్ పరిశ్రమల సిఎస్ఆర్ నిధుల ద్వారా పూడిమడక గ్రామానికి విద్యుత్తు లైట్లు వేయించాలని ఆ గ్రామ సర్పంచ్ చేపల సుహాసిని వెంకటరమణ ఏపీఐఐసి జోనల్ మేనేజర్‌ను బుధవారం కోరారు. పూడిమడక గ్రామంలో విద్యుత్తు లైట్లు లేక చీకటిలో మత్స్యకారులు జీవనం సాగించాల్సి వస్తుందని తెలిపారు. ప్రతిరోజు మత్స్యకారులు చేపల వేటకు రాత్రులు సమయంలో తీరానికి వెళ్లాల్సి వస్తుందని, విద్యుత్తు లైట్లు లేక వేటకు వెళ్తున్న మత్స్యకారులు సమస్యలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పూడిమడక గ్రామానికి దగ్గరలో ఉన్న పరిశ్రమలను సంప్రదించి తమ గ్రామానికి విద్యుత్తు లైట్లు వేయించేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వికలాంగ విద్యార్థుల సమస్యలు తెలియజేయండి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలపాలని ఎలమంచిలి కోర్టు సీనియర్ సివిల్ జడ్జి వేపకాయల విజయ కోరారు. మండలంలోని కొండకర్లలో ఇచ్ఛా ఫౌండేషన్, మోసయ్యపేటలో వికలాంగుల ఆశ్రమ పాఠశాలను మంగళవారం రాత్రి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో వసతి సౌకర్యాలను ఆమె పరిశీలించారు. దుస్తులు, పుస్తకాలు, మంచినీరు, విద్యుత్తు తదితర మౌలిక సదుపాయాల గురించి ఆమె ఆరా తీశారు. మీరు ఎదుర్కొంటున్న సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో పానల్ లాయర్ బి.హరి శంకర్‌రావు, పి.వి.రమణ, లోక అదాలత్ మెంబర్ నూకరాజు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన జడ్జి విజయ

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

-పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు

గొలుగొండలో అవగాహన కల్పిస్తున్న ఎఒ

ప్రజాశక్తి -నక్కపల్లి:వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలో జానకయ్యపేట, ఉద్దండపురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. సిబ్బందితో కలిసి వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. వరి నాటిన 25-30 రోజుల సమయంలో ఎకరాకు 20 కిలోల యూరియా వేసుకోవడం ద్వారా పిలకల సంఖ్య పెరుగుతుందని వివరించారు. నాట్లు వేసేటప్పుడు పొటాషియం ఎరువులు వేయకపోతే, 25 రోజుల వయసులో 20 కిలోల యూరియాతోపాటు 20 కిలోల పొటాష్ కూడా వేసుకోవడం ద్వారా పంటలో వ్యాధి నిరోధక శక్తి పెంచవచ్చునన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఆకు మడత, పాము పొడ తెగులు వరి పొలాల్లో తక్కువగా గమనించామని, వీటి నియంత్రణకు ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్, 400 మిల్లీలీటర్ల హెక్సాకొనజోల్ మందులను కలిపి పిచికారి చేయడం ద్వారా రెండింటిని అదుపు చేయవచ్చునని తెలిపారు. పిచికారి చేసేటప్పుడు పొలంలో నీటిని పూర్తిగా తీసివేసి చేయాలని, పొలం బాగా తడిచేలా చూసుకోవడం, గట్లపై కూడా పిచికారి చేయడం ద్వారా సమర్ధవంతంగా చీడపీడలను అదుపు చేయవచ్చునని అన్నారు. ఈ పర్యటనలో ఏఈఓ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

గొలుగొండ:గొలుగొండ మండల వ్యవసాయాధికారి సుధారాణి ఆధ్వర్యంలో బుధవారం ఏటిగైరంపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వరి పంట ఆశించే తెగులు, చీడ పీడలు, ఆకుముడత నివారణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట : మండలంలోని చింతపాకలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. రైతులకు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.భాస్కరరావు వరిసాగులో సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్ర సిబ్బందితో క్షేత్ర పరిశీలన చేపట్టి వివిధ పంటలలో ఆశించిన చీడపీడలను పరిశీలించారు. ముఖ్యంగా వరి పైరుపై ఆకుముడత ఆశించినట్లు గమనించారు. దీని నివారణకు కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ నీటిలో కరిగే పొడిమందు రెండు గ్రాములు ఒక లీటర్ నీటికి చొప్పున ఒక ఎకరా పొలానికి 400 గ్రాములు పిచికారి చేయాలని సూచించారు. అగ్గి తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొలజాన శ్రీను, పలువురు రైతులు పాల్గొన్నారు.

బుచ్చయ్యపేట మండలం చింతపాకలో...

కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త ఆదిలక్ష్మి మాటలుడుతూ ఆకు ముడత, పొడి తెగులు వరి పంటలో ఆశించే అవకాశం వుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి స్వప్న, పశువైద్య అధికారి డయానా, కూటిమి నాయకులు దొడ్డి నాగేశ్వరరావు, భూషణం, పొన్నాడ రాజు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వసంతాలను భక్తులపై జల్లుతున్న అర్చకులు

ఉపమాకలో వైభవంగా వసంతోత్సవం

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్స వాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం వసంతోత్సవ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి, సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై అదిష్టింపజేసి గ్రామంలో తిరు సేవ నిర్వహించారు. భక్తులు ఒకరిపై ఒకరు వసంతాన్ని జల్లుకుంటూ ఉత్సాహంతో మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

సిహెచ్‌సిలో వ్యాపిస్తున్న పొగ

సిహెచ్‌సి ఆవరణలోనే వ్యర్థాలు దగ్ధం

-పొగతో సతమతం

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆవరణలోనే బుధవారం సాయంత్రం సమయంలో వ్యర్థాలను తగలబెట్టడంతో రోగులు, అదేవిధంగా సమీప ప్రాంతం ప్రధాన రహదారి కావడంతో ప్రయాణికులు, కాలనీవాసులు పొగ కారణంగా ఇబ్బందులు పడ్డారు. హాస్పిటల్ వ్యర్థాలను ఆవరణలో తగలపెట్టడంతో సమీప ప్రాంత వాసులు ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒకపక్క ప్రభుత్వాలు స్వచ్ఛతేహి కార్యక్రమాలు అంటూ ఊదరగొడుతూ ఉంటే సిబ్బంది పర్యావరణానికి తూట్లు పొడిచే విధంగా సిబ్బంది వ్యవహరించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నేత రాజు

ఇళ్లు మంజూరు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని డొంకాడకు ఎల్‌పీసీలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం గ్రామంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, అటవీ హక్కుల చట్టం ప్రకారం డొంకాడలో నివాసం ఉంటున్న వారికి ప్రభుత్వం, ఫారెస్టు శాఖ నుండి ఎల్‌పీసీలు ఇచ్చి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు. అనేక ఏళ్లుగా డొంకాడలో నివాసం ఉంటున్న గిరిజనులకు, జీవనాధారంకు సంబంధం లేకుండా ఎక్కడో ఇళ్లు మంజూరు చేయడం సరికాదన్నారు. గిరిజనుల జీవనాధారం ఎక్కడ ఉంటే అక్కడ ఇళ్ళు మంజూరు చేయాలని, లేకుంటే రానున్న రోజులులో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు సత్తిబాబు, దాసు, సుబ్బారావు, పాండురాజు, రాము, బాస్కరరావు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: నవరాత్రి కార్యక్రమంలో భాగంగా స్థానిక రామాలయం వద్ద బుధవారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది చిన్నారులు పాల్గొని అక్షరాభ్యాసాలు చేశారు. ఈ సందర్భంగా కొరుప్రోలు రాజేష్ చేతుల మీదగా పలువురు చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు, పంపిణీ చేశారు.

గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురం గ్రామంలో రాజరాజేశ్వరి దేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా లక్ష్మీ గణపతి ఆలయం వద్ద సామూహిక ఉచిత అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. అక్షరాభ్యాసం చేయించుకునేందుకు బాలబాలికలు సుమారు 46 మంది పాల్గొన్నారు. ఆలయ అర్చకులు బద్రి, ఆలయ కమిటీ, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

నర్సీపట్నంలో చేయిస్తున్న అక్షర్యాభ్యాసం

జిల్లా కేంద్రాన్ని తరలిస్తే ఊరుకోం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:అల్లూరి జిల్లా కేంద్రాన్ని నర్సీటప్నం కేంద్రంగా తరలించేందుకు ప్రభుత్వం పూనుకుంటే ఊరుకునేది లేదని మాజీ ఎమ్మెల్యే ఫాల్గుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడ్లారు. అల్లూరి జిల్లా కేంద్రాన్ని మైదాన ప్రాంతంలోని నర్సీపట్నంలో తరలించే ప్రయత్నాల ఊహగానాలు అధికమయ్యాయని చెప్పారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పాడేరులో ఐటీడీఏ ఉన్నప్పటికి గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్నారని చెప్పారు. కనీస సౌకర్యాలతోపాటు అభివృద్ధికి నోచుకోలేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పుకార్లపై స్పందించాలని కోరారు.

ఎక్సైజ్ సిఐ మధుకుమార్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ ఎఫ్ఏసీ సీఐగా బి.మధుకుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన మద్యం విధానంలో భాగంగా షాపులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు అవకాశం ఉందన్నారు.

కోలాటంలో జెడ్‌పిటిసి రమణమ్మ బృందం

బ్రహ్మోత్సవాల్లో రమణమ్మ బృందం కోలాటం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్:తిరుమల తిరుపతి శ్రీవారి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా మండలంలో ధర్మసాగరం గ్రామానికి చెందిన జడ్పిటిసి సుకల రమణమ్మ కోలాటం కళాకారుల బృందం అలరించారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ, తమ కోలాట బృందాన్ని గుర్తించినందుకు గానూ నిర్వాహకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

తవ్వేసి వదిలేశారు..

అవస్థలు పడుతున్న కాలనీవాసులు

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రం సీతారామ నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు ఎదురుగా ఉన్న కాలనీకి వెళ్లే రోడ్డును తవ్వేసి వదిలేయడంతో కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి పోవడంతో రోడ్డు తవ్వి నీరు మళ్లించారు. అయితే దాదాపు రెండు నెలల క్రితం తవ్వేసిన కాలువ నేటికి అలానే వదిలేయడంతో విద్యార్థులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయంలో అదుపు తప్పి పడిపోవడంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. తవ్విన కాలువపై వేసిన సిమెంట్ పలక సైతం విరిగిపోయింది. దీంతో కాలనీవాసులు ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన చెందుతున్నారు పలుమార్లు అధికారులకు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

అస్తవ్యస్తంగా ఉన్న తవ్వి వదిలేసిన ప్రాంతం

సీజ్ చేసిన బియ్యం లారీ

25 వేల కేజీల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -నక్కపల్లి:25 వేల కేజీల పిడిఎఫ్ బియ్యం లారీపై అక్రమంగా రవాణా చేస్తుండగా దాడి చేసి సీజ్ చేసినట్లు సిఐ కుమారస్వామి తెలిపారు. సమాచారం మేరకు ఎస్సై విభూషణరావు, సిబ్బందితో కలిసి గొల్లపల్లి రైస్ మిల్లు నుండి అక్రమంగా బియ్యం లారీపై తరలిస్తుండగా వెదుళ్ళ పాలెం జంక్షన్ వద్ద లారీని తనిఖీ చేసి, సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

ఉపమాకలో గరుడాద్రి పర్వతంపై మేఘాలు

నింగిలో మేఘాలు కనువిందు

ప్రజాశక్తి-నక్కపల్లి:మండలంలోని ఉపమాకలో బుధవారం నింగిలో మేఘాలు కనువిందు చేశాయి. ఉపమాక వెంకన్న గరుడాద్రి పర్వతంపై మేఘాలు పాల మీగడలా మెరిసిపోతూ వివిధ ఆకృతిలో సందడి చేశాయి. నీలి రంగు ఆకాశం లో తెల్లటి మేఘాలు గరుడాద్రి పర్వతాన్ని అలుముకుని, వాటి ఆకారాలు చెరువులో ప్రతిబింబంచడంతో ప్రకృతి ప్రేమికులు వాటి అందాలను చూసి మైమరిచిపోయారు. ప్రకృతి అందాలను సెల్‌ఫోన్ లలో ఫోటోలు పలువురు తీసి బంధించారు.

మాట్లాడుతున్న కేంద్ర బృందం ప్రతినిధులు

ప్రభుత్వ పథకాలపై కేంద్ర బృందం సభ్యుల ఆరా

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రమణయ్యపేట, డిఎల్ పురం గ్రామాల్లో బుధవారం జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ ఆర్ ఎల్ ఎం) కేంద్ర బృందం ప్రతినిధులు అనిల్ గైక్వాడ్, అనిల్ నిమ్ బోత్కర్ లు పర్యటించారు.కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు ఏ విధంగా ఉపయోగ పడుతున్నాయో ఆరా తీశారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, గృహ నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. మహిళలు రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. ప్రభ్వుతం ఇస్తున్న ప్రోత్సాహాన్ని మహిళలు అందుపుచ్చుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ సచిదేవి, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ డైజీ, ఎంపీడీవో సీతారామరాజు, ఈవోపీఆర్డి సత్యనారాయణ, ఏపీవో భాగ్యలత, డిపిఎం శ్రీనివాస్, ఎసి సత్యవేణి, ఏపిఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అందజేస్తున్న లక్ష్మీనారాయణ దంపతులు

విద్యా మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డు గల్లులో సంత మార్కెట్ వద్ద నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన దేవి మండపం వద్ద బుధవారం అర్చకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సరస్వతి దేవి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు లక్ష్మీనారాయణ దంపతులు అట్టలు, జామెంట్రీ బాక్సులు, పుస్తకాలు అందజేశారు.

గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు

-ప్రజాభిప్రాయ సేకరణ సభలో అధికారులను నిలదీసిన సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘాల నేతలు

ప్రజాశక్తి -కొత్తకోట: గ్రామాల్లో మౌలిక సదుపాయాలు హరించే గ్రానైడ్ క్వారీలు వద్దని పలువురు గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. రావికమతం మండలం కె.కొట్నాబిల్లి గ్రామంలో ఆశ్రీత ఎంటర్ప్రైజెస్ గ్రానైట్ క్వారీ అనుమతుల కోసం బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ సభ నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి నర్సీపట్నం ఆర్‌డివో వి వి రమణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జెఈ కరుణకుమారి, రావికమతం తహసీల్దార్ వెంకటరమణ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశం ప్రారంభంలోనే పాత కొట్నాబిల్లి ఆదివాసీ గిరిజన మహిళలు తమకు తాగునీరు ఇప్పించండంటూ ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అక్కడ ఉన్న కొత్తకోట సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఆందోళన చేయకుండా సమస్యలు ఉంటే చెప్పండి అంటూ నిలువరించారు. క్వారీలతో గతంలో వేసిన రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని గదబపాలెం గ్రామస్థులు తెలిపారు.

హాజరైన అధికారులు

సభలో నిరసన చేపడుతున్న గిరిజన మహిళలు, సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘాల నేతలు

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోవిందరావు మాట్లాడుతూ, ఈ క్వారీలతో మంచినీరు పొల్యూషన్ గా తయారై అనేక వ్యాధుల బారిన పడి మృత్యువాత పడుతున్నారన్నారు. భారీ లారీ ల రవాణాతో తారు రోడ్లు కాస్త మట్టి రోడ్లు అయ్యాయని తెలిపారు. దీంతో, గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారని,గతంలో ఇచ్చిన క్వారీలతో ఇప్పటికే గిరిజనులకు మౌళిక సదుపాయాలు కోల్పోయారని నిలదీశారు. ప్రతి ఏటా నిధులు ఖర్చు చేస్తున్నట్టు చెబుతున్న అధికారులు అవి ఎక్కడ ఖర్చు చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపిటిసి గునుములు రాములు క్వారీ అనుమతులను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

మాజీ జడ్పీటీసీ ఆసరి వాసు గోవిందరావు క్వారీలతో గిరి గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, అనుమతి ఇవ్వండని పేర్కొన్నడంతో కొద్ది సేపు సభ ప్రాంగణం గందరగోళంగా మారింది.. పోలీసుల జోక్యంతో సద్దు మణిగింది. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో లేవనెత్తిన విషయాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు తెలిపారు.

అరకొరగా కందిపప్పు సరఫరా

ఇప్పటికే రేషన్ బియ్యం, పంచదార పంపిణీ

ప్రజాశక్తి -కోటవురట్ల:అసలే పండగల సమయం నిత్యవసర వస్తువులు రేట్లు ఆకాశాన్ని తాకిన సమయంలో పేదలకు కంది పప్పు అందిస్తామన్న ప్రభుత్వం ప్రకటనలకు పౌరసరఫరా సంస్థ పంపిణీ చేస్తున్న సరుకులకు ఎటువంటి పొంతన కనిపించడం లేదు. ఈనెలలో రేషన్ కేవలం బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ చేసి చేతులు దులుపుకుంటున్నారు.

మండల వ్యాప్తంగా 15,857 తెల్ల రేషన్ కార్డుదారులు ఉండగా వారికి బియ్యం సుమారుగా 209 టన్నులు అందిస్తున్నారు, అరకిలో పంచదార కార్డుదారులకు అందిస్తూ ఉండగా, కందిపప్పు మాత్రం దసరా సందర్భంగా అయినా అందక పోవడంతో తెల్లరేషన్ కార్డుదారులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడు వచ్చిన అరకొర కందిపప్పు కార్డుదారులకు అందేనా అని లబ్ధిదారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గ్రామాలలో ఇంటింటికి రేషన్ బండి వాహనం ద్వారా బియ్యం పంచదార గడిచిన వారం రోజులుగా సరఫరా చేస్తున్నారు. ఈ విషయమై పౌరసరఫరాల శాఖ సిఎస్‌డిటి అప్పలనాయుడును వివరణ కోరగా, 15,857 కార్డు లకు గాను కేవలం 4000 కందిపప్పు ప్యాకెట్లు మాత్రమే గోదాముకు వచ్చాయని తెలిపారు. వచ్చిన సరుకును సోమవారం నుండి గ్రామాల వారీగా సర్ది పంపుతున్నామని తెలిపారు.

మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కృషి : ఎంపీ శ్రీభరత్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గడిచిన మూడు నెలల్లో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం పనిచేస్తున్నామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ తెలిపారు. టిడిపి కార్యాలయంలో బుధ వారం సాయంత్రం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో కలిసి ఎంపీ మీడియాతో మాట్లాడారు. ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు, తాము స్టీల్‌ప్లాంట్‌పై కేంద్ర స్టీల్ మంత్రులతో సమావేశమయ్యామని తెలిపారు. స్టీల్‌ప్లాంటును కాపాడి లాభాల బాటలో నడపాలని ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. థర్డ్ పార్టీతో టెక్నికల్ అండ్ కమర్షియల్ రిపోర్ట్‌ను తెప్పించుకుంటామని, దీని ఆధారంగా ఒక నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల్లోకి తీసుకువెళ్లి దేశానికి ఆదర్శంగా నిలబెడతామని చెప్పారు. అన్ని రూపాల్లో రూ.30 వేల కోట్లు లైబులిటీస్ ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం రూ.500 కోట్లు ఒకసారి, బ్యాంక్ ఫైనాన్స్ కోసం రూ.1160 కోట్లు మొత్తం రూ.1660 కోట్లు కేంద్రం నుంచి తేగలిగామని తెలిపారు. గతంలో ఎవరైనా ఇలా డబ్బులు తేగలిగారా అని ప్రశ్నించారు.

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. ప్లాంట్ పరిరక్షణ తమ ధ్యేయం అన్నారు. డిసెంబర్‌లో విశాఖ రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరుగుతుందని చెప్పారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత

-డాక్టర్ ఎన్‌జి.నిహాల్



ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంవిపి కాలనీలోని కౌసల్య కౌన్సెలింగ్ సెంటర్ డాక్టర్ ఎన్‌జి.నిహాల్ సూచించారు. గురువారం ప్రపంచ మానసిక దినోత్సవాన్ని పురస్కరించుకొని మానసిక సమస్యలకు సంబంధించి డాక్టర్ ఎన్‌జి.నిహాల్ పలు సూచనలు చేశారు. సంపూర్ణ ఆరోగ్యం అంటే కేవలం రోగాలు లేని దారుఢ్యం కలిగిన శరీరం మాత్రమే కాదని, మానసిక ప్రశాంతత ఉండాలని చెప్పారు. సాంఘిక సౌలభ్యత లేని జీవితాన్ని ఊహించుకోవడం కష్టమన్నారు. అందుకే ప్రపంచ ఆరోగ్య సంస్థ సంపూర్ణ ఆరోగ్యం నిర్వచనంలో శారీరక, మానసిక, సాంఘిక ఆరోగ్యాలను అంతర్భాగం చేసిందని తెలిపారు. అయినప్పటికీ మానసిక ఆరోగ్యం మీద ప్రజలలో అనేక అపోహలున్నాయని, ఈ అపోహలను తొలగిస్తూ, అవగాహనను పెంచడం కోసం ఏటా అక్టోబరు 10వ తేదీన ఒక నినాదంతో ప్రపంచ మానసిక ఆరోగ్య దినంగా ప్రకటించిందని తెలిపారు. 'వృత్తి ప్రదేశాల్లో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనిద్దాం' ఈ సంవత్సర నినాదం అని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం అంటే తమతోపాటు సామాజిక శ్రేయస్సును కాంక్షిస్తూ భావోద్వేగ నియంత్రణ కలిగి ఉండడమని వివరించారు. నిత్య జీవితంలో ప్రతి నిర్ణయమూ మానసిక స్థితి గతులపైనే ఆధారపడి ఉంటుందని తెలిపారు. సరైన మానసిక ఆరోగ్యం లేకుండా శారీరక ఆరోగ్యం సాధించడం కుదరదన్నారు. మంచి మానసిక ఆరోగ్యం అత్యవసర ప్రామాణికమని పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నప్పుడు కలిగే మార్పులు ఆందోళన, దిగులు, నిరాశక్తి, నిస్పృహ, నిరాశ, ఆత్మహత్యాపూరిత ఆలోచనలు, చిరాకు, కోపం, ముభావం, ఆసక్తి కోల్పోవడం, మద్యం, మత్తు పదార్థాలకు బానిస అవ్వడం వంటివి జరుగుతాయని తెలిపారు. మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం తమకు తగిన వృత్తిని ఎంచుకోవడం, శక్తి సామర్థ్యాలకు అనుగుణమైన ప్రణాళిక, సహచరులతో స్నేహ పూర్వకంగా మెలగడం, నిబద్ధమైన పనితీరును చూపించడం, యాజమాన్య ఒడంబడిక ప్రకారం నడుచుకోవడం, అవసరమైన విరామం తీసుకోవడం, మంచి ఆహారం, సరిపడా నిద్ర, శారీరక వ్యాయామం ఆరోగ్య హేతువులు అని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రపంచంలో అను నిత్యం సవాళ్లను ఎదుర్కోవడానికి ధృఢ చిత్తం అత్యావశ్యమని తెలిపారు .

షిప్‌యార్డ్‌ను సందర్శించిన తోషిబా అధికారులు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : భారతదేశం యొక్క గ్రీన్ టగ్ ప్రోగ్రామ్‌ను వేగవంతం చేసే దిశగా గణనీయమైన ఎత్తుగడలో తోషిబా బ్యాటరీ విభాగం డైరెక్టర్ కజుటకా నిషిమురా, లోటస్ వైర్‌లెస్ చైర్మన్‌తో కలిసి హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌ను సందర్శించారు. పర్యావరణ అనుకూల సముద్ర పరిష్కారాల కోసం భారత ప్రభుత్వం చేస్తున్న కృషికి అనుగుణంగా, ఆకుపచ్చ నౌకల కోసం అత్యాధునిక బ్యాటరీలను అభివృద్ధి చేయడంలో సహకార ప్రయత్నాలు లక్ష్యంగా ఈ పర్యటన నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా హిందుస్థాన్ షిప్‌యార్డ్ సిఎమ్‌డి హేమంత్ ఖత్రి మాట్లాడుతూ, తోషిబా వంటి గ్లోబల్ లీడర్లు భారతీయ భాగస్వాములతో కలిసి పనిచేస్తూ భారతదేశ గ్రీన్ షిప్పింగ్ విప్లవంలో అగ్రగామిగా ఉన్నందుకు హిందుస్థాన్ షిప్‌యార్డ్ గర్విస్తోందని పేర్కొన్నారు. సముద్ర పరిశ్రమను ముందుకు నడిపేందుకు స్థిరమైన, అధిక పనితీరు గల గ్రీన్ నౌకలను అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. గ్రీన్ టగ్ ప్రోగ్రామ్ లక్ష్యాలను సాధించడంలో అత్యాధునిక బ్యాటరీ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.